సాక్షి నిజామాబాద్


సోమవారం, 24, జూన్, 2024



మామతో కలిసి భర్త హత్య

మద్యానికి బానిసై తీవ్రంగా హింసిస్తున్నాడని కట్టుకున్న భర్తను మామతో కలిసి భార్య హతమార్చింది.

- 8లో ▸



గుడుంబాపై ఉక్కుపాదం

గుడుంబా తయారీ, విక్రయంపై అబ్కారీ శాఖ దృష్టి సారించింది. ప్రభుత్వ ఆదేశాలతో గుడుంబా నియంత్రణకు చర్యలు చేపట్టింది.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
33.9 /22.9

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. వాతావరణంలో తేమ అధికంగా ఉంటుంది. జిల్లాలో అక్కడక్కడ వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

జిల్లాలో 13.1 మి.మీ. వర్షపాతం

సుభాష్‌నగర్: జిల్లా వ్యాప్తంగా శనివారం రాత్రి వాన కురవడంతో 13.1 సగటు వర్షపాతం నమోదైంది. అత్యధికంగా నవీపేట్‌లో 83.7 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. రెంజల్‌లో 48.0, ఎడపల్లిలో 33.3, బోధన్‌లో 32.5, నిజామాబాద్‌నార్త్‌లో 29.3, నిజామాబాద్ రూరల్‌లో 26.1, మోస్రాలో 20.4, సాలూరలో 17.5, వర్నిలో 16.6, సాత్‌లో 16.3, మాక్లూర్‌లో 14.4, నందిపేట్‌లో 13.2, తదితర మండలాల్లో చిన్నపాటి జల్లులు కురిశాయి. జిల్లావ్యాప్తంగా 8 మండలాల్లో అత్యధిక వర్షపాతం నమోదు కాగా, 12 మండలాల్లో సాధారణ, 12 మండలాల్లో లోటు, ఒక మండలంలో అతి తక్కువ వర్షపాతం నమోదైందని వాతావరణశాఖ అధికారులు పేర్కొన్నారు. రానున్న రెండు రోజులు జిల్లావ్యాప్తంగా వర్షాలు కురిసే అవకాశముంది.

440 మంది విద్యార్థుల ధ్రువపత్రాల పరిశీలన

నిజామాబాద్‌అర్బన్: నగరంలోని పాలిటెక్నిక్ కళాశాలలో రెండో రోజు పాలిసెట్ కౌన్సెలింగ్ కొనసాగింది. ఇందులో భాగంగా ఆదివారం 440 మంది విద్యార్థుల ధ్రువపత్రాలను పరిశీలించారు. ఈనెల 25 వరకు ధ్రువపత్రాల పరిశీలన కొనసాగుతుందని కౌన్సెలింగ్ సమన్వయకర్త శ్రీరాంకుమార్ తెలిపారు.

సీఎంను కలిసిన పీజీ హెచ్‌ఎంలు



నిజామాబాద్‌అర్బన్: ప్రభుత్వ పాఠశాలలు, టీచర్ల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కోరుతూ ఆదివారం తెలంగాణ స్టేట్ గెజిటెట్ ప్రధానోపాధ్యాయుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజ్‌గంగారెడ్డి ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా పలు సమస్యలకు సంబంధించిన అంశాలను విన్నవించారు. సానుకూలంగా స్పందించిన ముఖ్యమంత్రి త్వరలోనే సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు రాజ్‌గంగారెడ్డి తెలిపారు. సీఎంను కలిసిన వారిలో సంఘం నాయకులున్నారు.



ప్రభుత్వ పాఠశాలలకు అందించాల్సిన ఉచిత పాఠ్య పుస్తకాలు పక్కదారి పట్టాయి. నగరంలోని మిర్చి కంపౌండ్‌లోని గోదాం నుంచి 80 వేలకు పైగా పుస్తకాలు మాయం అయ్యాయి. ఈ ఘటనపై డీఈవో ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. వ్యవహారంపై విచారణ చేపట్టాలని జిల్లా విద్యాశాఖ కార్యాలయంలోని సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. దీంతో విచారణాధికారి పుస్తకాల లెక్కలు తీసే పనిలోపడ్డారు.

పుస్తకాలు పక్కదారి!

- గోదాం నుంచి మాయం
- ఆగ్రహం వ్యక్తం చేసిన డీఈవో

నిజామాబాద్‌అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది పాఠ్యపుస్తకాలను విద్యార్థులకు సకాలంలో అందించాలని నిర్ణయించింది. ఈ మేరకు మే నెల నుంచే పుస్తకాల పంపిణీ ప్రారంభించింది. ఈ మేరకు జిల్లా విద్యాశాఖకు సంబంధించిన గోదాంలో పుస్తకాలు నిల్వచేసి పాఠశాలలకు పంపిణీ చేపట్టింది. అయితే ఇందులో నుంచి వేల సంఖ్యలో పాఠ్య పుస్తకాలు పక్కదారి పట్టాయి. జిల్లా కేంద్రంలోని మిర్చి కాంపౌండ్‌లో ఉన్న పాఠ్య పుస్తకాలు గోదాం నుంచి పలుమార్లు పాఠ్య పుస్తకాలు ఇతర ప్రాంతాలకు తరలినట్లు తెలుస్తోంది.

జిల్లాకు ఆరు లక్షలకుపైగా పుస్తకాల సరఫరా

జిల్లాలో మొత్తం 1171 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 2,55,67 మంది విద్యార్థులు చదువుతున్నాయి. వీరికోసం 6,37,120 పుస్తకాలు సరఫరా చేశారు. విద్యార్థులకు అన్ని సబ్జెక్టులకు సంబంధించి పాఠ్యపుస్తకాలను ప్రభుత్వం ఉచితంగా అందిస్తుంది. పాఠశాలల్లోని విద్యార్థుల సంఖ్య ఆధారంగా మార్చిలో వివరాలను రాష్ట్ర విద్యాశాఖకు పంపించారు. దీని ఆధారంగా పాఠ్యపుస్తకాలను ప్రభుత్వం మే నెలలోనే సరఫరా చేసింది. ప్రస్తుతం ఉన్న పాఠ్యపుస్తకాలను అన్ని పాఠశాలలకు సరఫరా చేసినట్లు జిల్లా విద్యాశాఖ పేర్కొంది. కానీ గోదాం నుంచి పుస్తకాలు రహస్యంగా బయటకు తరలించినట్లు తెలుస్తోంది. ఈ పుస్తకాలను



నగరంలో మిర్చి కంపౌండ్‌లోని ప్రభుత్వ పుస్తకాల గోదాం

కొందరు ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలకు విక్రయించినట్లు సమాచారం. పుస్తకాలపై ఉన్న ప్రభుత్వ లోగోపై స్టిక్కర్లు అతికించి వినియోగంలోకి తీసుకువచ్చినట్లు తెలిసింది. ఇందులో పని చేసే వారే పాఠ్యపుస్తకాలను బయటకు పంపించినట్లు ఆరోపణలున్నాయి. ప్రస్తుతం విద్యాశాఖ అన్ని పుస్తకాలను పాఠశాలలకు పంపిణీ చేసినట్లు నివేదికలో పేర్కొంది. కానీ నివేదికల ప్రకారం జిల్లాలోని పలు పాఠశాలలకు ఇంతవరకు పాఠ్యపుస్తకాలు అందలేదు. సరఫరా అయిన పాఠ్య పుస్తకాలు పాఠశాలలోని విద్యార్థుల సంఖ్య అనుగుణంగా పరిశీలిస్తే 86వేల పుస్తకాలు తక్కువగా వస్తున్నట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారాన్ని బయటకు పొక్కనియకుండా విద్యాశాఖ అధికారులే కప్పిపుచ్చుతున్నారు. ప్రతియేటా ఇక్కడ నుంచి పుస్తకాలు బయటకు తరలుతున్నట్లు ఆరోపణలున్నాయి. లారీల ద్వారా మండలాలకు సరఫరా చేసే క్రమంలో వీటిని కొందరు ఉద్యోగులు తమకు అనుకూలమైన ప్రాంతంలో దాచి.. పక్కదారి పట్టించినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం పాఠ్యపుస్తకాలు అందని పాఠశాలల నివేదికలు పరిశీలిస్తే అసలు విషయం బయటపడే అవకాశం ఉంది.

కాపలాదారుడు ఉన్నా..

పాఠ్యపుస్తకాల గోదాంలో ప్రతిరోజూ రాత్రివేళ ఒక అటెండర్ విధులు నిర్వహిస్తుంటాడు. అయినా కూడా గోదాం నుంచి పాఠ్య పుస్తకాలు రాత్రివేళ బయటకు తరలింపుపై విద్యాశాఖ అధికారులు ఆందోళన చెందుతున్నారు. ఈ వ్యవహారంపై పూర్తిస్థాయి విచారణ జరిపేందుకు సిద్ధమయ్యారు. పాఠ్య పుస్తకాల పంపిణీ సరఫరా లెక్కలు తేల్చి మిగతా పుస్తకాల విషయమై లోతుగా విచారణ చేసే అవకాశం ఉన్నట్లు తెలిసింది. కాగా పాఠ్య పుస్తకాలను బయట విక్రయించిన వ్యక్తులు ఎవరు, ఎవరికి విక్రయిస్తున్నా, ఎప్పటి నుంచి విక్రయిస్తున్నారు అనే విషయంపై విద్యాశాఖ అధికారులు లోతుగా విచారణ చేపట్టే అవకాశం ఉంది. ఏది ఏమైనా ఉచితంగా అందించే ప్రభుత్వ పాఠ్యపుస్తకాలను బయటకు పంపించడంలో ఉద్యోగుల అవినీతి బయటపడింది. ప్రతి పాఠ్య పుస్తకం వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసినా పుస్తకాలు మాయం కావడంపై విద్యాశాఖ అధికారులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

నేటి నుంచి జూనియర్ డాక్టర్ల సమ్మె

- డిమాండ్ల సాధన కోసం పోరాటం
- ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసిన కళాశాల వైస్ ప్రిన్సిపాల్



నిజామాబాద్‌నాగారం: జూనియర్ డాక్టర్లు నిరవధిక సమ్మెకు సిద్ధమయ్యారు. నేటి నుంచి జిల్లాలో విధులు నిర్వహిస్తున్న 42 మంది జూనియర్ డాక్టర్లు సమ్మెలోకి వెళ్లనున్నారు. అత్యవసర విభాగంలో మాత్రమే విధులు నిర్వహించనున్నారు. తమ డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ సమ్మెకు దిగనున్నారు. దీంతో ప్రభుత్వ మెడికల్ కళాశాల వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్ నాగమోహన్ ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇప్పటికే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు. ఇతర వైద్యుల సెలవులను రద్దు చేశారు. అందరికి సెలవులు రద్దు చేశామని.. విధుల్లో చేరి సేవలందించాల్సిందేనంటున్నారు.

జిల్లాలో 42 మంది..

నిజామాబాద్ ప్రభుత్వ వైద్యకళాశాల, జీజీహెచ్ పరిధిలో మొత్తం 42 మంది జూనియర్ డాక్టర్లు ఉన్నారు. జూనియర్ డాక్టర్ల అసోసియేషన్(టీ–జూడా) అసోసియేషన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు వీరు సమ్మెలోకి వెళ్తున్నారు. అత్యవసర సేవలు, ఐసీయూ సేవలు మినహా అందరూ సమ్మెలో ఉండి నిరసన తెలపనున్నారు. పలుమార్లు తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని విన్నవించినా ప్రభుత్వాలు పెడచెవిన పెట్టాయని చెబుతున్నారు. ప్రతినెలా స్టయిఫండ్ నిధులు విడుదల చేయడంతో పాటు మరో ఏడు ప్రధానమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతున్నా పట్టించుకోవడం లేదని వాపోయారు. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో సమ్మెకు దిగాల్సి వచ్చిందని పేర్కొంటున్నారు.

సెలవులు రద్దు

జూనియర్ డాక్టర్లు సమ్మెలోకి వెళ్తున్న నేపథ్యంలో జీజీహెచ్‌కు వచ్చే రోగులకు వైద్య సేవల విషయంలో ఇబ్బందులు రాకుండా ఉండేందుకు అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు ఆస్పత్రిలోని అందరి వైద్యుల సెలవులు రద్దు చేశారు. సెలవుల్లో ఉన్న వారు వెంటనే విధుల్లో చేరాలని ఆదేశాలిచ్చారు. అంతేకుండా అసిస్టెంట్ ప్రొఫెసర్‌లు–84 మంది, అసోసియేట్ ప్రొఫెసర్లు –21 మంది, హౌస్ సర్జన్లు, పీజీ విద్యార్థులందరూ విధులు నిర్వహించనున్నారు. ప్రొఫెసర్లు మానిటరింగ్ చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఇలా రోగులకు వైద్య సేవల్లో ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకున్నారు.

రోగులకు ఇబ్బందులు రానివ్వబోం

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జూనియర్ డాక్టర్ల సమ్మె నేపథ్యంలో సెలవులు రద్దు చేశాం. సెలవుల్లో ఉన్నవారు కూడా నేటి నుంచి విధుల్లో చేరాల్సిందే. రోగులకు వైద్యపరంగా అందించే సేవల్లో ఇబ్బందులు రాకుండా అన్ని రకాల జాగ్రత్తలు తీసుకోనున్నాం.

– డాక్టర్ నాగమోహన్, మెడికల్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్

నేటి నుంచి హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ల పరీక్ష

నిజామాబాద్‌అర్బన్: హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ ఎంపిక పరీక్ష సోమవారం నుంచి ఈ నెల 29వ తేదీ వరకు జరుగనున్నాయి. ఇందుకు సంబంధించి అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. జిల్లాలోని క్షత్రియ కళాశాల, నాలెడ్జ్ పార్క్ పాఠశాలల్లో సెంటర్లు ఏర్పాటు చేశారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు తిరిగి మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్ష జరుగనున్నాయి. పరీక్ష ఆన్‌లైన్ విధానంలో నిర్వహించనున్నారు. అభ్యర్థులు పరీక్ష కేంద్రానికి గంట ముందుగానే చేరుకోవాల్సి ఉంటుంది.

రుణమాఫీ ప్రకటనతో రైతుల్లో హర్షం

- ఏక కాలంలో రూ. 2 లక్షలు మాఫీ చేయనున్న ప్రభుత్వం
- త్వరలో వెలువడనున్న మార్గదర్శకాలు



మోర్తాడ్(బాల్కొండ): పంట రుణాల మాఫీకి రాష్ట్ర మంత్రి వర్గం ఏకగ్రీవంగా ఆమోదం తెలపడంతో రైతుల్లో హర్షం వ్యక్తం అవుతోంది. రూ. 2 లక్షల వరకు రుణాన్ని ఏక కాలంలో మాఫీ చేయాలని ప్రభుత్వం నిర్ణయిం తీసుకుంది. దీంతో బీఆర్‌ఎస్ హయాంలో రుణమాఫీ పొందని రైతులకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో లబ్ధి చేకూరనుంది. 2018 డిసెంబర్ 12 నుంచి 2023 డిసెంబర్ 9 వరకు తీసుకున్న రుణాలను మాఫీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. కటాఫ్ తేదీ ఖరారు కాగా.. రుణ మాఫీకి ఎవరు అర్హులనే అంశాలకు సంబంధించి మార్గదర్శకాలను జారీ చేయాల్సి ఉంది. రెండు, మూడు రోజుల్లో మార్గదర్శకాలను జారీ చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెల్లడించారు. మార్గదర్శకాలు జారీ చేస్తే రుణ మాఫీపై మరింత స్పష్టత రానుంది. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో కొద్ది మందికే మాఫీ సొమ్ము జమైంది. నిధులను సకాలంలో విడుదల చేయకపోవడంతో పంట రుణం మాఫీకి ఎంతో మంది అర్హులు దూరమయ్యారు. జిల్లాలో 1,93,770 మంది రైతులకు మాఫీ సొమ్ము అందలేదు. కేవలం 97,418 మందికి రూ.490.72 కోట్లు మాత్రమే మాఫీ సొమ్ము జమ చేశారు. ఇంకా అవసరమైన నిధులను విడుదల చేయకపోవడంతో రైతులకు నిరాశ తప్పలేదు.

పీఎం కిసాన్ నిబంధనల ప్రకారమైతే..

పీఎం కిసాన్ నిబంధనల ప్రకారమే రుణ మాఫీని వర్తింప చేస్తే జిల్లాలో లబ్ధిదారుల సంఖ్య తగ్గే అవకాశం ఉంది. ప్రస్తుతానికి జిల్లాలో 2.80 లక్షల మంది రైతులు ఉన్నారు. వీరిలో 2.50 లక్షల మంది పంట రుణాలు తీసుకోగా ఇందులో 1.50 లక్షల మంది అర్హులు అయ్యే అవకాశం ఉంది. రుణం ఎక్కువగా ఉండటం, ఒక కుటుంబంలో అందరికి పంట రుణం ఉండటం, ప్రభుత్వ ఉద్యోగులు, పింఛన్ దారులు, ఆదాయపు పన్ను చెల్లింపులు, అత్యధిక విస్తీర్ణం భూములు ఉన్న రైతులు అయితే వారికి పీఎం కిసాన్ యోజన వర్తించదు. పీఎం కిసాన్ సమ్మాన్ యోజన కింద ప్రతి ఏటా రూ. 6వేలను మూడు విడతల్లో విడుదల చేస్తున్నారు. ఈ పథకం అర్హులైన రైతులకే వర్తింప చేసేదిగా ఉంది. ఈ అంశాన్ని పరిగణనలోకి తీసుకుని రైతు పంట రుణాల మాఫీ విషయంలో ఆచితూచి అడుగు వేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఏది ఏమైనా కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో మెజార్టీ రైతులకు పంట రుణాల బాకీల నుంచి విముక్తి లభించనుందని చెప్పవచ్చు.

మాట నిలబెట్టుకున్నారు



రైతులకు పంట రుణాలను మాఫీ చేయడంలో సీఎం రేవంత్‌రెడ్డి మాట నిలబెట్టుకుంటున్నాడు. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఏదో ఒక విధంగా పంట రుణాలను మాఫీ చేయాలని నిర్ణయించారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో రైతులకు జరిగిన అన్యాయం జరుగకుండా చూస్తున్నారు.

– తక్కూరి సతీష్, కాంగ్రెస్ నాయకుడు, మోర్తాడ్

రైతులు రుణపడి ఉంటారు



పంట రుణాలను ఒకేసారి మాఫీ చేస్తే రైతులు కాంగ్రెస్ ప్రభుత్వానికి రుణపడి ఉంటారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని చూస్తుంది. బీఆర్‌ఎస్ ప్రభుత్వం రైతులకు రైతుబంధు ఇచ్చాం అనే సాకుతో రుణ మాఫీ చేయలేదు. ప్రస్తుత ప్రభుత్వం రుణ మాఫీ విషయంలో మాటపై నిలబడి ఉండాలి.

–లింగారెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్

ఉపాధిలో ఉద్యాన తోటలు

- ఈ ఏడాది జిల్లాకు 1,350 ఎకరాలు లక్ష్యం
- 17 రకాల పండ్ల తోటలకు అవకాశం
- రైతుల నుంచి దరఖాస్తులు తీసుకుంటున్న అధికారులు





నికాల్‌పూర్‌లో సాగవుతున్న జామ తోట(ఫైల్)

డొంకేశ్వర్(ఆర్మూర్):ఉపాధి హామీ పథకం ద్వారా పండ్ల తోటలు సాగుచేసే కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం కొనసాగిస్తోంది. 2024–25 సంవత్సరానికి జిల్లాలో 1,350 ఎకరాల్లో పండ్ల తోటలను సాగు చేయించాలని గ్రామీణాభివృద్ధి శాఖకు ఆదేశాలు వచ్చాయి. ప్రభుత్వ ఆదేశాలతో జిల్లాలోని ప్రతి మండలానికి 50 ఎకరాల లక్ష్యాన్ని విధించారు. ఉద్యాన తోటల సాగుకు రైతులు ముందుకు వచ్చేలా అధికారులు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తున్నారు. ఫీల్డ్ అసిస్టెంట్లు, ఏపీవోలే కాకుండా పంచాయతీరాజ్ నుంచి జీపీ కార్యదర్శులను, వ్యవసాయ శాఖ నుంచి ఏఈవోలను ఈ కార్యక్రమంలో చేర్చారు. అయితే, పండ్ల తోటలు సాగుచేసే రైతులకు ఐదెకరాల్లోపు వ్యవసాయ భూమి ఉండాలి. ఉపాధిహామీ జాబ్‌కార్డు కూడా తప్పనిసరి. ఎందుకంటే పండ్ల తోటలు సాగుచేసే రైతులకు ప్రభుత్వమే అన్ని సదుపాయాలు కల్పిస్తోంది. మొక్కల కొనుగోలు నుంచి గుంతల తవ్వకం, ప్లాంటేషన్, ఎరువులు, నిర్వహణ, కూలీ ఖర్చులు పూర్తిగా ప్రభుత్వమే భరిస్తుంది. తొలుత ఖర్చు చేస్తే తిరిగి రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అవుతాయి. రైతులు మొత్తం 17 రకాల పండ్ల తోటలు సాగు చేసుకోవడానికి అవకాశం ఉంది. ఇందులో జామ, బత్తాయి, మామిడి, సపోట, డ్రాగన్ ఫ్రూట్, సీతాఫలం, నిమ్మ, దానిమ్మ, కొబ్బరి, ఆయిల్‌పాం, అల్లనేరేడు, మునగ, స్వీట్ ఆపిల్, చింత, ఇతర రకాల తోటలున్నాయి. తోటల సాగుకు ముందుకు వచ్చిన రైతుల వివరాలను గ్రామసభ ద్వారా తీర్మానం చేసి మండల శాఖ ద్వారా జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖకు పంపుతారు.

డ్రిప్ సదుపాయం లేదు

ఉపాధిహామీ కింద పండ్ల తోటలు సాగు చేస్తున్న రైతులకు ప్రభుత్వం గతంలో డ్రిప్ సదుపాయం కల్పించింది. గతేడాది జిల్లాలో 104 మంది రైతులు ముందుకు రాగా, 150 ఎకరాల్లో తోటలను సాగు చేశారు. సాగు చేసిన రైతులందరికీ సబ్సిడీపై డ్రిప్ సిస్టంను అందజేస్తామని ప్రభుత్వం చెప్పింది. కొంతమంది డీడీలు చెల్లించినప్పటికీ డ్రిప్ ఇవ్వలేదు. దీంతో వారికి డబ్బులు తిరిగిచ్చే ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రస్తుత ఏడాదికి నిర్దేశించిన లక్ష్యానికి కూడా డ్రిప్ సదుపాయం కల్పించలేదు. దీంతో రైతులే సొంతగా ఖర్చు చేసుకోవాలి. దీని కారణంగా రైతులు ముందుకు వస్తారా లేదో చూడాలి.

రైతులు ముందుకు రావాలి



జిల్లాలో ఉద్యాన తోటల సాగు పెంచాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఉపాధిహామీలో పండ్ల తోటల పెంపకాన్ని తీసుకువచ్చింది. రైతులకు ఎలాంటి ఖర్చు లేకుండా ప్రభుత్వమే అన్ని చెల్లిస్తుంది. ఐదెకరాల్లోపు భూమి ఉన్న రైతులు పండ్ల తోటల సాగుకు ముందుకు రావాలి. స్థానికంగా ఉన్న పంచాయతీ కార్యదర్శులను, ఫీల్డ్ అసిస్టెంట్లను, ఏఈవోలను సంప్రదిస్తే సరిపోతుంది.

– సాయాగౌడ్, డీఆర్‌డీవో, నిజామాబాద్

వీసాలు రాక.. విదేశాలకు వెళ్లలేక..

- యూరప్ దేశాల్లో ఉపాధి పేరిట దందా
- డబ్బులు వసూలు చేసి ముఖం చాటేసిన ఏజెంట్
- రూ. 2 కోట్ల వరకు కుచ్చుటోపీ
- ఆందోళనలో బాధితులు

మోర్తాడ్(బాల్కొండ): గల్ఫ్ దేశాలకంటే యూరప్ దేశాల్లో మంచి పని, ఎక్కువ జీతం లభిస్తాయని నమ్మించి నిరుద్యోగులకు రూ.2 కోట్ల వరకు టోపీ పెట్టాడో ఏజెంట్. వివరాలిలా ఉన్నాయి. టర్కీ, మాల్టావంటి యూరప్ దేశాలతోపాటు అర్మేనియా, ఇజ్రాయిల్ తదితర దేశాల్లో ఉపాధి కల్పించడానికి వర్క్ వీసాలు ఇప్పిస్తానని జగిత్యాల కేంద్రంగా ట్రావెల్ ఏజెన్సీ నిర్వహిస్తున్న ఏజెంట్ నిరుద్యోగులను నమ్మించాడు. దీంతో నిజామాబాద్, నిర్మల్, జగిత్యాల, మంచిర్యాల, కరీంనగర్, రాజన్న సిరిసిల్ల జిల్లాలకు చెందిన దాదాపు 150 మంది నిరుద్యోగులు ఆ ఏజెంట్‌ను నమ్మి డబ్బులు చెల్లించారు. ఒక్కో నిరుద్యోగి వద్ద రూ. లక్ష నుంచి రూ. 2 లక్షల వరకు వసూలు చేసిన ఏజెంట్.. వీసా ప్రాసెస్ కావడానికి రెండు నెలల సమయం పడుతుందని చెప్పాడు. డబ్బులు చెల్లించి పాస్‌పోర్టులు ఇచ్చి నాలుగైదు నెలలు అవుతున్నా ఏ ఒక్కరికీ వీసా రాలేదు. దీంతో ఆందోళన చెందినవారు ఏజెంట్‌కు ఫోన్లు చేయగా.. తాను ముంబయిలో ఉన్నానని ఒకసారి, ఢిల్లీలో ఉన్నానని మరోసారి చెబుతూ కొన్నాళ్లు తప్పించుకున్నాడు. ఇటీవల ఫోన్ స్విచ్ ఆఫ్ వస్తుండడంతో జగిత్యాలలోని సదరు ఏజెంట్ ట్రావెల్స్ కార్యాలయానికి వెళ్లి రిసెప్షనిస్టులను నిలదీశారు. ఏజెంట్ అందుబాటులోకి రాకపోవడంతో విసిగిపోయిన పలువురు బాధితులు మూడు రోజుల క్రితం పోలీసులకు ఫిర్యాదు చేశారు. డబ్బులతో పాటు ఒరిజినల్ పాస్‌పోర్టులు ఏజెంట్ వద్దే ఉన్నాయని పేర్కొన్నారు. తమకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు.



ప్రవాసీ మిత్ర లేబర్ యూనియన్ అధ్యక్షుడికి వినతి పత్రం అందిస్తున్న బాధితుడు

కేసులు పెట్టాలి

లైసెన్స్ లేని ఏజెంట్లే ఎక్కువగా మోసాలకు పాల్పడుతున్నారు. ఇమ్మిగ్రేషన్ యాక్ట్ ప్రకారం అలాంటి వారిపై కేసులు నమోదు చేయాలి. నిరుద్యోగులు కూడా పాస్‌పోర్టులు, డబ్బులు ఇచ్చే ముందు ఏజెంట్ గురించి ఆరాతీయాలి.

–స్వదేశ్, ప్రవాసీ మిత్ర లేబర్ యూనియన్ అధ్యక్షుడు

నిజాంసాగర్ ఆయకట్టును గట్టెక్కిస్తాం

- ఎమ్మెల్యేలు పోచారం, లక్ష్మీకాంతారావు
- ప్రాజెక్టు నుంచి నీటి విడుదల ప్రారంభం

నిజాంసాగర్: నిజాంసాగర్ ప్రాజెక్టు ఆయకట్టును గట్టెక్కిస్తామని బాన్సువాడ, జుక్కల్ ఎమ్మెల్యేలు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మీకాంతారావు పేర్కొన్నారు. ఆదివారం ప్రాజెక్టు నుంచి ప్రధాన కాలువకు నీటి విడుదల ప్రారంభించారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నిజాంసాగర్ ప్రాజెక్టులో నీటి నిల్వలు సరిపడా లేకున్నా, ఆయకట్టు కింద పంటల సాగు అవసరాలకు రెండు విడతల్లో 2.9 టీఎంసీల నీటిని విడుదల చేస్తామన్నారు. అలీసాగర్ రిజర్వాయర్ వరకు 1.35 లక్షల ఎకరాలను సస్యశ్యామలం చేస్తామన్నారు. వర్షాలు సకాలంలో కురవకపోతే కొండపోచమ్మ సాగర్ నీటితో గట్టెక్కిస్తామన్నారు. ఆయకట్టు రైతులు నీరు వృథా కాకుండా చూసుకోవాలన్నారు. సమావేశంలో ఎంపీపీ పట్లోళ్ల జ్యోతి, నీటిపారుదలశాఖ సీఈ శ్రీనివాస్, ఈఈ సోలోమన్, నాయకులు దఫేదార్ రాజు, ప్రదీప్, మల్లికార్జున్, రవీందర్‌రెడ్డి, గంగారెడ్డి, ఏర్వల కృష్ణారెడ్డి పాల్గొన్నారు.



నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యేలు

క్లుప్తంగా

నాగమడుగు పనుల పరిశీలన



నిజాంసాగర్(జుక్కల్): మంజీరా నదిపై నిర్మిస్తున్న నాగమడుగు ఎత్తిపోతల పనులను ఆదివారం జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు పరిశీలించారు. రూ. 476 కోట్లతో చేపడుతున్న నాగమడుగు పనుల పురోగతి, భూ సేకరణ వివరాలను నీటిపారుదలశాఖ అధికారులను ఆయన అడిగి తెలుసుకున్నారు. కరకట్టల ఎత్తు తగ్గించి భూములు కోల్పోకుండా చూడాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఎమ్మెల్యే వెంట నీటిపారుదలశాఖ సీఈ శ్రీనివాస్, ఎస్ఈ వాసంతి, ఈఈ సోలోమాన్ నాయకులు ప్రదీప్, మల్లికార్జున్, ప్రజా పండరి తదితరులు ఉన్నారు.

చెక్‌డ్యాం పనులు..



బిచ్కుంద(జుక్కల్) : మండలంలోని గుండెనెమ్లి వద్ద మంజీరా నదిలో నిర్మిస్తున్న చెక్‌డ్యాం పనులను ఆదివారం ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు పరిశీలించారు. పనులు ఎంత వరకు పూర్తయ్యాయని అధికారులకు అడిగి తెలుసుకున్నారు. నిర్మించిన చెక్‌డ్యాం పది కాలాలపాటు ఉండేవిధంగా నిర్మించాలని కాంట్రాక్టర్‌ను సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయ రంగానికి పెద్దపీట వేస్తోందన్నారు. మంజీరాపై నిర్మిస్తున్న చెక్‌డ్యాంలతో బండారెంజల్, గుండెనెమ్లి, వాజిద్‌నగర్, పుల్కల్, శెట్లూర్, ఖద్గాం బీర్కూర్ మండలా రైతులు, ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు విఠల్‌రెడ్డి, రాంరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు సిద్దిరాములు, వెంకట్‌రెడ్డి, గంగాధర్, మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

అర్చరీ క్రీడాకారులకు సన్మానం



దోమకొండ : మండల కేంద్రానికి చెందిన పలువురు అర్చరీ క్రీడాకారులు జాతీయస్థాయి ఖేలో పోటీల్లో రాణించి పతకాలు సాధించగా వారిని ఆదివారం సన్మానించారు. గ్రామానికి చెందిన కదిరె సింధుజ ఇటీవల అర్చరీ ఖేల్ ఇండియా పోటీ ల్లో ఉత్తమ ప్రతిభతో పతకాలు సాధించింది అదేవిధంగా అర్చరీ స్పోర్ట్స్ కోటాలో గ్రామానికి చెందిన అర్చరీ క్రీడాకారుడు శ్రీధర్ అగ్నిపథ్‌కు ఎంపికయ్యాడు. వీరిని అర్చరీ అసోసియేషన్ కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు తీగల తిర్మల్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి కదిరె మోహన్‌రెడ్డి శాలువాలతో సన్మానించారు. అర్చరీలో క్రీడాకారులను ఉత్తములుగా తీర్చిదిద్దుతున్న అర్చరీ కోచ్ ప్రతాప్‌దాస్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో అర్చరీ ఉమ్మడి జిల్లా అసోసియేషన్ కార్యదర్శి నర్సింహారెడ్డి, సలహదారులు పిన్నం రాంచంద్రం, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో ప్రతిభ



రామారెడ్డి : ఆదియోగి పరమేశ్వర యోగా అకాడమీ ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో ఉప్పల్‌వాయి గ్రామానికి చెందిన నివాస్ ప్రతిభ కనబర్చి ప్రథమ స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా ప్రథమ స్థానంలో నిలిచిన నివాస్‌కు ఆదివారం ప్రశంశాపత్రం అంజేశారు.

గుడుంబాపై ఉక్కుపాదం

- ఆగస్టు 31 నాటికి పూర్తిస్థాయిలో అరికట్టేందుకు ఎక్సైజ్ శాఖ ప్రణాళిక
- జిల్లాలో మూడు మండలాల గుర్తింపు
- ఇప్పటికే పలువురిని బైండోవర్ చేసిన అధికారులు

రాష్ట్రాన్ని గుడుంబా రహితంగా మార్చాలని భావించిన అప్పటి ప్రభుత్వం 2016లో సత్ఫలితాలను సాధించింది. ఎనిమిదేళ్ల క్రితం కఠిన చర్యలు చేపట్టి గుడుంబాను నియంత్రించినప్పటికీ మళ్లీ ఆ స్థాయిలో దృష్టి సారించలేదు. దీంతో మళ్లీ గుడుంబా గుప్పుమంటోంది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా ప్రణాళిక రూపొందించి ఆగస్టు 31 నాటికి రాష్ట్రాన్ని గుడుంబా రహితంగా మార్చేందుకు ప్రణాళికను సిద్ధం చేస్తోంది.



ఖలీల్‌వాడి: గుడుంబా తయారీ, అమ్మకాలను నియంత్రించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. గుడుంబా అమ్మకాలను అరికట్టామని ఎక్సైజ్‌శాఖ భావించినప్పటికీ కొన్ని చోట్ల తయారీ, విక్రయం చాపకింద నీరులా విస్తరిస్తోంది. ఈ నేపథ్యంలో గుడుంబా నియంత్రణ కోసం ఎక్సైజ్‌శాఖ అధికారులు ప్రణాళిక సిద్ధం చేసి ముందుకు వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. ఇందులో భాగంగా పాత, కొత్త నేరస్తులపై దృష్టి సారించారు.

గడువు విధించిన ప్రభుత్వం

గుడుంబాను పూర్తిస్థాయిలో నియంత్రించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆగస్టు 31వ తేదీని గడువుగా నిర్ణయించింది. ఈ మేరకు ఎక్సైజ్ అధికారులు దశలవారీగా ప్రణాళికలను రూపొందించారు. అనుమానిత ప్రాంతాలు, ఇళ్లపై దాడులు చేస్తూనే మరోవైపు గుడుంబా తయారీ స్థావరాలను గుర్తించే పనిలో పడ్డారు. సమస్యాత్మక, అటవీ ప్రాంతాల్లో అధికారులు తనిఖీలు చేస్తున్నారు. పాతనేరస్తులు, కొత్తగా గుడుంబా తయారు చేస్తున్న వారి వివరాలు, ఏఏ గ్రామాలు, ప్రాంతాల్లో తయారీ, వినియోగం తదితర వివరాలను సేకరిస్తున్నారు. మూడేళ్ల కాలంలో గుడుంబా సంబంధిత కేసుల్లో ఉన్న వారి వివరాలను పరిశీలిస్తున్నారు. వారి కార్యకలపాలపై నిఘా సారించి ఎప్పటికప్పుడు సమాచారం సేకరిస్తున్నారు. బైండోవర్, స్టేషన్ బెయిల్ తీసుకొని మళ్లీ గుడుంబా వ్యాపారం చేసే వారిపై కఠిన చర్యలు తీసుకునేందుకు కసరత్తు చేస్తున్నారు. గుడుంబా తయారీదారులతోపాటు సరఫరా చేసే వినియోగించే వారిపై కేసులు నమోదు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

సిరికొండ, ధర్పల్లి, ఇందల్వాయిల్లో..

జిల్లాలోని సిరికొండ, ధర్పల్లి, ఇందల్వాయి మండలాల్లో గుండుబా తయారు చేస్తున్నట్లు ఎక్సైజ్ శాఖ గుర్తించింది. మూడు మండలాల్లోని కొన్ని గ్రామాల్లో కొంత మంది సొంతంగా ఇప్పుపువ్వ సారాయి తయారీ చేసినట్లు గుర్తించారు. మరి కొన్ని చోట్ల బెల్లం, పట్టికతో బట్టీలు పెట్టి గుడుంబా తయారీ చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఆయా ప్రాంతాల్లో గుడుంబా తయారీని అడ్డుకోవడానికి ఎన్‌ఫోర్స్‌మెంట్, టాస్క్‌ఫోర్స్‌తోపాటు ఎక్సైజ్ శాఖ అధికారులు ప్రత్యేకంగా బృందాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిసింది. ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగడం ద్వారా జిల్లాలో గుడుంబా తయారీ పూర్తిగా నియంత్రణలోకి వస్తుందని అధికారులు చెబుతున్నారు.

అధికారులే బాధ్యులు..

గుడుంబా నియంత్రణ చర్యల్లో ఎక్సైజ్‌శాఖ కానిస్టేబుల్ నుంచి ఉన్నతాస్థాయి అధికారి వరకు ప్రభుత్వం బాధ్యులను చేసింది. ముందుగా రూపొందించి ప్రణాళిక ప్రకారం సిబ్బంది, అధికారులు తమ పనితీరును చూపాల్సి ఉంటుంది. మొదటి దశలో గుడుంబా స్థావరాలు, ప్రాంతాలు, గ్రామాలు, పాత నేరస్తుల వివరాలు సేకరించాల్సి ఉంటుంది. సేకరించిన సమాచారాన్ని స్టేషన్ అధికారికి అందించిన తర్వాత నివేదికను సిద్ధం చేయాల్సి ఉంటుంది. ఈ నివేదికపై వేరే జిల్లాలకు చెందిన అధికారులు వచ్చి వాస్తవాలను తెలుసుకుంటారు. నివేదిక ప్రకారం అక్కడ పరిస్థితులు తేడా ఉంటే అధికారులపై చర్యలు తీసుకుంటారు. గుడుంబా నియంత్రణ కోసం క్షేత్ర స్థాయిలో బృందాల పనితీరుపై ప్రత్యేక బృందాలు ఎప్పటికప్పుడు ఆరా తీస్తాయి.

గుడుంబా రహిత జిల్లా చేస్తాం



ఉన్నతస్థాయి నుంచి వచ్చిన ఆదేశాల ప్రకారం గుడుంబా స్థావరాలపై బృందాల ద్వారా దాడులను చేస్తాం. ఆగస్టు 31 వరకు జిల్లాను గుడుంబారహిత జిల్లాగా మార్చుతాం. అవసరమైతే పోలీసులు, ఇతర ప్రభుత్వ శాఖల సహాయంతో ముందుకు వెళ్తాం. గుడుంబా తయారు చేసినా, వినియోగించినా, రవాణా చేసినా బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే పాత నేరస్తులపై నిఘా పెట్టాం.

– మల్లారెడ్డి, ఎక్సైజ్ సూపరింటెండెంట్, నిజామాబాద్

క్రైం కార్నర్

మామతో కలిసి భర్త హత్య

- వేధింపులు భరించలేక గొడ్డలితో దాడి
- తిర్మలాపూర్‌లో దారుణం



రాములు మృతదేహాన్ని వెలికి తీయిస్తున్న సీఐ కృష్ణ



రాములు (ఫైల్)

బాన్సువాడ రూరల్: మద్యానికి బానిసై జులాయిగా తిరుగుతూ వేధిస్తున్న భర్తను మామ సాయంతో భార్య హత్య చేసింది. ఈ ఘటన బాన్సువాడ మండలం తిర్మలాపూర్‌లో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. కురుమ రాములు(38) భార్య మంజుల, తండ్రి నారాయణతోపాటు ముగ్గురు పిల్లలతో కలిసి ఉంటున్నాడు. ఏ పని చేయకుండా జులాయిగా తిరిగే రాములు మద్యం సేవిస్తూ వేధిస్తున్నాడు. ఇదిలా ఉండగా, ప్రతిరోజూ తనకు ఫోన్ చేసే బావమరిది ఫోన్ చేయడం లేదని, అతడి ఫోన్ స్విచ్ఛాఫ్ వస్తోందని అనుమానంతో రాములు బావ శ్రీనివాస్ ఈనెల 16వ తేదీన మంజులతోపాటు మామ నారాయణను ప్రశ్నించాడు. హైదరాబాద్‌లో పనికి వెళ్తున్నానని తమతో చెప్పి 9వ తేదీనే ఇంటి నుంచి వెళ్లాడని వారు సమాధానమిచ్చారు. అదే రోజు తన భర్త రాములు కనిపించడం లేదని మంజుల పోలీసులకు సైతం ఫిర్యాదు చేసింది. అయితే, ఇద్దరి ప్రవర్తనపై అనుమానం రావడంతో శ్రీనివాస్ ఆదివారం ఉదయం మంజుల, నారాయణను గ్రామ ఎంపీటీసీ వద్దకు తీసుకెళ్లి గట్టి ప్రశ్నించగా, వేధిస్తున్నాడని తామే రాములును హత్య చేసినట్లు ఒప్పుకున్నారు.

గొడ్డలితో నరికి.. సెప్టిక్ ట్యాంకులో పారేసి..

సమాచారం అందుకున్న సీఐ కృష్ణ, పోలీసు సిబ్బంది గ్రామానికి చేరుకొని విచారించగా నిందితులు నేరాన్ని ఒప్పుకుని వివరాలు వెల్లడించారు. మద్యానికి బానిసైన రాములు తరచుగా వేధిస్తూ తిట్టడం, కొట్టడం చేస్తుండడంతో అతనిని చంపాలని నిర్ణయించుకున్నామన్నారు. ఈనెల 9వ తేదీన రాములు మద్యం సేవించి వచ్చిన రాములు తిని పడుకున్నాడని, ఆ తరువాత మూత్ర విసర్జనకు లేవగా వెనుక నుంచి గొడ్డలితో నరికి హతమార్చామని తెలిపారు. అనంతరం మృతదేహాన్ని ఇంటి వెనుక ఉన్న సెప్టిక్ ట్యాంకులో పారేసామని, రెండు రోజుల తరువాత దుర్వాసన వస్తుండడంతో ఇంటి పక్కనే గుంత తవ్వి పూడ్చి పెట్టామని వివరించారు. సీఐ కృష్ణ, తహసీల్దార్ వరప్రసాద్ సమక్షంలో మృతదేహాన్ని వెలికితీయించి అక్కడే పోస్టుమార్టం చేసిన అనంతరం మృతుడి అక్కాబావకు అప్పగించారు. మంజులతోపాటు నారాయణను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో మేస్త్రి మృతి

మాచారెడ్డి: కామారెడ్డి జిల్లా మాచారెడ్డి మండలంలోని ఘన్‌పూర్ శివారులో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తాపీ మేస్త్రి మృతి చెందాడు. ఎస్సై శ్రీనివాస్గౌడ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రకాశం జిల్లా కనిగిరికి చెందిన రసూల్(32) కొన్నేళ్ల క్రితం మాచారెడ్డి మండలానికి వలసవచ్చాడు. చుక్కాపూర్ గ్రామంలో నివసిస్తూ మేస్త్రిగా పనిచేస్తున్నాడు. ఆదివారం సాయంత్రం నడుచుకుంటూ ఘన్‌పూర్ గ్రామం వైపు వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా కారు ఢీకొట్టింది. తలకు బలమైన గాయాలుకావడంతో ఘటనా స్థలంలోనే రసూల్ మృతి చెందాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అనుమానాస్పదస్థితిలో ఒకరు..

బాన్సువాడ: పట్టణంలోని హనుమాన్‌గల్లీకి చెందిన మంటిగె రమేశ్(22) అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు సీఐ కృష్ణ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. సెంట్రింగ్ పని చేసే రమేశ్ ఒంటరిగా జీవిస్తున్నాడు. ఆదివారం ఉదయం అతడి ఇంటికి స్నేహితుడు మహేశ్ వెళ్లి చూడగా రమేశ్ ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. వెంటనే మృతుడి అన్న కుమార్‌కు రమేశ్ సమాచారం అందించాడు. రమేశ్ తొడపై రక్తపు మరకలు ఉండడంతో అతడి మృతిపై అనుమానాలు వ్యక్తం చేస్తూ సోదరుడు కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మురికికాలువలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

ఖలీల్‌వాడి: మురికికాలువలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం ఉన్నట్లు స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. నగరంలోని రెండోటౌన్ పోలీస్ పరిధిలోని పెద్దబజార్‌లో మెడికల్ పక్కన ఉన్న మురికి కాలువలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. మృతుడి వయస్సు 35 ఏళ్లు ఉంటుందని, మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించామని పోలీసులు తెలిపారు.

విద్యుత్ షాక్‌తో గేదె మృతి



డొంకేశ్వర్(ఆర్మూర్): మండలంలోని గాదేపల్లిలో విద్యుత్ షాక్‌తో గేదె మృతి చెందింది. గ్రామ కూడలి వద్ద తక్కువ ఎత్తులో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు ఉన్న తీగ తగిలి గేదె అక్కడిక్కడే మృతి చెందింది. ఘటనా స్థలాన్ని విద్యుత్, పశుసంవర్ధక శాఖ అధికారులు పరిశీలించారు. మృతి చెందిన గేదె విలువ రూ.70వేల వరకు ఉంటుందని, ప్రభుత్వం తనకు నష్టపరిహారం అందించాలని బాధితుడు నర్సారెడ్డి కోరాడు.

లిఫ్ట్ ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం



డొంకేశ్వర్(ఆర్మూర్): మండలంలోని దత్తాపూర్ లిఫ్ట్ ట్రాన్స్‌ఫార్మర్‌ను శనివారం అర్ధరాత్రి దుండగులు ధ్వంసం చేశారు. విలువైన పరికరాలతోపాటు ఆయిల్‌ను చోరీ చేశారు. సమాచారం అందుకున్న లిఫ్ట్ చైర్మన్ సుంకరి రాజు ట్రాన్స్‌కో సిబ్బందితో కలిసి లిఫ్ట్‌ను సందర్శించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ట్రాన్స్‌ఫార్మర్‌ను పూర్తిగా ధ్వంసం చేయడంతో రూ.3లక్షల వరకు నష్టం జరిగిందని ఫిర్యాదులో పేర్కొన్నారు.

నేషనల్ హైవేపై లారీ బోల్తా

పెద్దకొడప్‌గల్(జుక్కల్): నేషనల్ హైవే 161పై అదుపు తప్పి లారీ బోల్తాపడింది. మండలంలోని బేగంపూర్ చౌరస్తా వద్ద ఆదివారం ఈ ఘటన చోటుచేసుకుంది. హైదరాబాద్ నుంచి దెగ్లూర్ వైపు వెళ్తున్న ట్రక్ అదుపు తప్పి బోల్తాపడిందని, ఈ ఘటనలో ఎవరికీ గాయాలు కాలేదని జాతీయ రహదారి భద్రతాసిబ్బంది తెలిపారు.

లీకేజీతో భగీరథ నీరు కలుషితం



సదాశివనగర్(ఎల్లారెడ్డి) :మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల ఆవరణలో ఉన్న రక్షిత మంచి నీటి ట్యాంక్ వద్ద కొన్ని రోజులుగా భగీరథ పైప్‌లైన్ లీకేజీ కావడంతో కులాయిలకు వచ్చే నీరు కలుషితం అవుతుంది. దీంతో ప్రజలు రోగాల బారిన పడే ప్రమాదం ఉంది. లీకేజీ గురించి సంబంధిత పంచాయతీ సిబ్బందికి చెప్పిన పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

త్రో సీడ్ బాల్స్ విజయవంతం



కామారెడ్డి రూరల్ : కామారెడ్డి జిల్లా కేంద్రంలోని స్వచ్ఛంద సేవా సంస్థ సెవెన్ హార్ట్స్ ఆర్గనైజేషన్ ఎన్జీవో ఆధ్వర్యంలో ఆదివారం మండలంలోని చిన్న మల్లారెడ్డి గ్రామంలో 'త్రో సీడ్ బాల్స్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్జీవో ఫౌండర్ ఈ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతూ వారం రోజుల కిందట తయారు చేసిన సీడ్ బాల్స్‌ను మైదాన, చెరువు గట్టు ప్రాంతాల్లో వేయడం ద్వారా వర్షపు నీటి వల్ల మొలకెత్తి పండ్ల చెట్టుగా అవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్జీవో ప్రతినిధులు పవన్ కళ్యాణ్, మౌనిక, సమీనా, మహేశ్వరి తదితరులున్నారు.

ఐసీడీ సౌత్‌జోన్ ఆఫ్ ఇండియా రీజెంట్‌గా శ్రీకాంత్‌దేశాయ్



శ్రీకాంత్ దేశాయ్, దంతవైద్యుడు

బోధన్: పట్టణానికి చెందిన ప్రముఖ దంతవైద్య నిపుణుడు శ్రీకాంత్ దేశాయ్ ఐసీడీ (ఇంటర్నేషనల్ కాలేజీ ఆఫ్ డెంటిస్ట్స్) అసోసియేషన్ సౌత్ జోన్ ఆఫ్ ఇండియా రీజెంట్‌గా నియమితులయ్యారు. న్యూ ఢిల్లీలో నిర్వహించిన ఐసీడీ (ఇండియా, శ్రీలంక, నేపాల్) సెక్షన్–6 ప్రతినిధుల సమావేశానికి శ్రీకాంత్ దేశాయ్ హాజరయ్యారు. ఐసీడీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ యోగేశ్‌కుమార్ విరమణి నియామక పత్రాన్ని ఆదివారం అందజేసినట్లు శ్రీకాంత్ దేశాయ్ తెలిపారు. ఈ నియామకంతో శ్రీకాంత్‌దేశాయ్‌కి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. బోధన్ మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ సునీతా దేశాయ్, సీనియర్ న్యాయవాది వీ వెంకటేశ్వర్‌రావుదేశాయ్ (ఏఎంసీ మాజీ చైర్మన్) దంపతుల కుమారుడైన శ్రీకాంత్‌దేశాయ్ పట్టణంలోని కొన్నేళ్లుగా దంతవైద్యశాలను నిర్వహిస్తూ మంచి గుర్తింపు పొందారు.

ఆపన్నహస్తం కోసం ఎదురుచూపు

- లివర్ సమస్యతో బాధపడుతున్న చిన్నారి తనుశ్రీ
- ట్రాన్స్‌ప్లాంట్ చేయాలన్న వైద్యులు
- తమ బిడ్డ ప్రాణాలను కాపాడాలని వేడుకుంటున్న తల్లిదండ్రులు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తనుశ్రీ

ఎడపల్లి (బోధన్): ఎనిమిదేళ్లుగా లివర్ సమస్యతో బాధపడుతున్న మండల కేంద్రానికి చెందిన కోమటి తనుశ్రీ(8) తన ప్రాణాలను రక్షించే ఆపన్నహస్తం కోసం దీనంగా ఎదురు చూస్తోంది. పుట్టిన మూడు నెలల నుంచే లివర్ సమస్య రావడంతో తల్లిదండ్రులు మల్కయ్య, సుస్మిత ఆస్పత్రులు చుట్టూ తిరుగుతున్నారు. హైదరాబాద్‌లోని అపోలో ఆస్పత్రిలో చికిత్స చేయించామని, ఇప్పటి వరకు రూ.20లక్షలు ఖర్చు చేశామని తల్లిదండ్రులు తెలిపారు. గత 20రోజులుగా కిమ్స్‌లో చికిత్స పొందుతున్నట్లు పేర్కొన్నారు. తమ బిడ్డకు లివర్ ట్రాన్స్‌ప్లాంట్ చేస్తే బతికే అవకాశాలు ఉన్నాయని వైద్యులు తెలిపారని, రూ.30లక్షల వరకు ఖర్చవుతుందని, దాతలు ముందుకు వచ్చి (98667 02812) తమ బిడ్డ ప్రాణాలను కాపాడాలని వేడుకుంటున్నారు.

ఇరుకు రోడ్లపై కఠిన నిబంధనలు



స్టేషన్‌రోడ్డులో ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి ఎదుట గల యూ టర్న్ వద్ద అస్తవ్యస్తంగా రాకపోకలు

- కామారెడ్డి పట్టణ ప్రజలకు నరకయాతన
- వెడల్పునకు నోచుకోని నిజాంసాగర్ చౌరస్తా
- యూటర్న్‌లతో చిరాకు

కామారెడ్డి అర్బన్ : కామారెడ్డి పట్టణంలో ట్రాఫిక్ నిబంధనలు ప్రజలను కన్నీళ్లు తెప్పిస్తున్నాయని పలువురు వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అసలే రోడ్లన్నీ ఇరుకుగా మారుగా, అందులో అనవసర ట్రాఫిక్ నిబంధనలు సృష్టిస్తూ అధికారులు ఇబ్బందులకు గురిచేస్తున్నారని పట్టణవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిజాంసాగర్ చౌరస్తాలో 30ఏళ్లుగా రోడ్డు వెడల్పు, ట్రాఫిక్ సర్కిల్ ఏర్పాటు కాకపోవడంతో పట్టణ ప్రజల్లో అసహనం నెలకొంది. నిజాంసాగర్ చౌరస్తా వద్ద ఇరువైపులా రాజకీయ ప్రముఖుల కట్టడాలు ఉండడంతో వాటిని కూల్చే దమ్ము ఎవరికి లేకుండా పోయింది. దీంతో నిజాంసాగర్ రోడ్డు వైపు నుంచి వచ్చే వాహనాలను దాదాపు 800 మీటర్లు తిప్పి మున్సిపాలిటీ ఎదుట యూటర్న్ నుంచి మళ్లిస్తున్నారు. పాత పట్టణంలోకి వెళ్లడానికి దాదాపు కిలో మీటరు అదనంగా తిరగాల్సి రావడం వల్ల వాహనాలకు ఇంధన భారంతో పాటు సమయం వృథా అవుతుంది.

జయశంకర్ విగ్రహం వద్ద..

అలాగే జయశంకర్ విగ్రహం వద్ద యూటర్న్ జిల్లా పరిషత్ హైస్కూల్, డిప్యూటీ డీఈవో, హెడ్‌పోస్టాఫీసు, పాస్‌పోర్టు సేవా కేంద్రం వద్ద ఉన్నాయి. జయశంకర్ విగ్రహం వద్ద యూటర్న్‌ను మూసివేయడంతో దాదాపు కిలో మీటరు దూరం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి వద్ద ఏర్పాటు చేసిన యూటర్న్ ద్వారా రావాల్సి వస్తుంది. పోస్టాఫీస్‌కు వాహనంపై రావాలంటే అదనంగా కిలోమీటరు దూరం చుట్టూ తిరిగి రావాల్సి వస్తుందని పోస్టాఫీస్ ఖాతాదారులు వాపోతున్నారు. ఇలా వాహనదారులను చుట్టూ తిప్పి ట్రాఫిక్ అధికారులు పొందే ఆనందం ఏమిటో అర్థం కావడం లేదని అంటున్నారు. అలాగే రైల్వేస్టేషన్ నుంచి నిత్యం వందలాది సరుకు రవాణ లారీలు కూడా చుట్టూ తిరగడం వల్ల ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి వద్ద అనవసర ట్రాఫిక్ ఏర్పడి ఇబ్బందులు వస్తున్నాయి. ఇలాగే పెద్దబజార్, భారత్‌రోడ్డు, గోపాలస్వామి రోడ్డు, భవానీరోడ్డు, ఇస్లాంపుర వెళ్లే వారు కిలో మీటరు అదనంగా వెళ్లాల్సివస్తుంది. ఇలా ప్రతి ఒక్కరికి ఇబ్బందులకు గురి చేస్తున్న నిజాంసాగర్ రోడ్డు, జయశంకర్‌సార్ యు టర్న్‌లను వెంటనే తెరిపించాలని పట్టణ ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. ట్రాఫిక్ నియంత్రణ పేరిట ప్రజలను చుట్టు తిప్పి ఆర్థిక, మానసిక, శారీరక వేదనకు గురిచేయడం పట్ల ప్రజలు ప్రతిరోజు నాయకులు, ప్రభుత్వాన్ని శాపనార్థాలు పెడుతున్నారు. స్థానిక శాసనసభ్యుడు, మున్సిపల్ పాలక వర్గం పట్టణ ప్రజల అభిప్రాయాల మేరకు సౌకర్యవంతమైన ట్రాఫిక్ యూటర్న్‌లు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

పల్లెల్లో వలస కూలీల సందడి



మోపాల్‌లో వరి నాట్లు వేస్తున్న బెంగాల్ కూలీలు

- నాట్లు వేసేందుకు బెంగాల్, బీహార్ నుంచి రాక

మోపాల్(నిజామాబాద్‌రూరల్): వరి నాట్లు వేసేందుకు మండలంలోని మోపాల్, కంజర్, ముదక్‌పల్లి, బాడ్సి, మోపాల్, తాడెం తదితర గ్రామాలకు వలస కూలీలు వస్తున్నారు. వానాకాలం సీజన్ ప్రారంభం కావడంతో పశ్చిమ్‌బెంగాల్‌లోని కోల్‌కత్తా, బీహార్, మహారాష్ట్ర, తదితర రాష్ట్రాల నుంచి తరలివస్తున్నారు. ఇప్పటికే ఆయా గ్రామాలకు వలస కూలీలు చేరుకున్నారు. ఎకరానికి రూ.4500 వరకు ఇచ్చి రైతులు నాట్లు వేయిస్తున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి వ్యవసాయ కూలీలు రావడంతో ఇక్కడి కూలీల కొరతకు చెక్ పడింది. వానాకాలం సీజన్‌లో కూలీలకు డిమాండ్ ఎక్కువగా ఉంటుంది. వర్షాలు కురిసిన సమయంలో ఎక్కువ మంది నాట్లు వేస్తుండటంతో.. కూలీల కొరత ఏర్పడుతోంది. గత నాలుగైదేళ్లుగా బీహార్, బెంగాల్ నుంచి కూలీలు వస్తుండటంతో రైతులు ఊపిరి పీల్చుకుంటున్నారు.

మానసిక ఒత్తిడికి గురికావొద్దు



కామారెడ్డి టౌన్ : కష్టాలను ఎదుర్కొనేలా ప్రతిఒక్కరూ తమ జీవనశైలిని మార్చుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఓం శాంతి భవనంలో జరిగిన 59వ పుణ్య స్మృతి దివాస్ కార్యక్రమానికి ఆమె హాజరై మాట్లాడారు. మానసిక ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్‌లు హఫీస్‌బేగ్, శివకృష్ణమూర్తి, నాయకులు సుధాకర్, బ్రహ్మకుమారీలు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



కామారెడ్డి రూరల్ : దివ్యాంగ ఉద్యోగ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆదివారం హైదరాబాద్‌లోని సీఎం కార్యాలయంలో దివ్యాంగ ఉద్యోగ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హేమచంద్ర సీఎం రేవంత్ రెడ్డిని కలిసి విన్నవించినట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జంగం శ్రీశైలం తెలిపారు. దివ్యాంగుల బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలని విన్నవించారు.